నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
12 | మహబూబ్‌నగర్, సోమవారం 28 ఏప్రిల్ 2025 | MAHABUBNAGAR NARAYANPET



వనపర్తిలోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

## వరంగల్ సభ చారిత్రాత్మకం

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 27 : వరంగల్ సభలో కేసీఆర్ చేసే దిశా నిర్దేశం కోసం తెలంగాణ ప్రజలే కాకుండా దేశ ప్రజలు వేచి చూస్తున్నారని, ఈ సభ చారిత్రాత్మకంగా నిలువబోతున్నదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ రజతోత్సవం సందర్భంగా ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి బీఆర్ఎస్ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజకీయ చరిత్రలో రజతోత్సవ సభ చారిత్రాత్మకంగా నిలుస్తుందన్నారు. కుట్రలు, కుతంత్రాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పతనం ఇప్పటికే ప్రారంభమైందన్నారు. కేసీఆర్ దిశా నిర్దేశం కోసం తెలంగాణ ప్రజలే కాకుండా యావత్ దేశ ప్రజలు ఎదురు చూస్తున్నారని, బీఆర్ఎస్ సభల నిర్వహణలో తన రికార్డు తానే బద్దలు కొట్టుకొని చరిత్రలో కొత్త రికార్డు సృష్టిస్తుందన్నారు. అనంతరం వరంగల్ రజతోత్సవ సభకు నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, వాకిటి శ్రీధర్, నందిమళ్ల అశోక్, రమేశ్‌గౌడ్, రాజు, నర్సింహ, విష్ణు, గిరి, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంతటి జనసంద్రాన్ని ఊహించలేదు..



వరంగల్ రజతోత్సవ సభను విజయవంతం చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు. మొక్కవోని దీక్షతో కేసీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి పెద్దఎత్తున తరలివచ్చారు. మేము అనుకున్న లక్ష్యానికి మించి ఇంతటి జనాన్ని చూసి మాకే ఆశ్చర్యం కలిగింది. వరంగల్ దూరం కావడంతో పరిధిమేర కార్యకర్తలను తరలించాలని పార్టీ అధిష్టానం ఆదేశించింది. అయినప్పటికీ ఊహించిన దానికంటే పెద్దమొత్తంలో కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలిరావడం చూస్తుంటే రానున్న రోజుల్లో గులాబీ జెండా రెపరెపలాడడం ఖాయం. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు వరంగల్ సభకు వెళ్లేలా ఏర్పాట్లు చేశాం. కార్యకర్తల్లో ఫుల్ జోష్ కనిపిస్తుంది.

– వి. శ్రీనివాస్‌గౌడ్, మాజీ మంత్రి, మహబూబ్‌నగర్



కేటీఆర్‌తో కలిసి విజయకేతనం చూపిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, గువ్వల బాలరాజు, మర్రి జనార్దన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి

# రజతోత్సవ సంబురం

# దారులన్నీ.. ఓరుగల్లు వైపే

- ఉత్సాహంగా కదిలిన బీఆర్ఎస్ సైనికులు
- జెండా పండుగతో గులాబీమయమైన పల్లె, పట్టణం
- వందల సంఖ్యలో తరలిన వాహనాలు
- వాహన శ్రేణులను ప్రారంభించిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు
- కేసీఆర్ వెంటే ఉంటామన్న పాలమూరు ప్రజానీకం

బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలు అంబరాన్నంటాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆదివారం పార్టీ 25ఏండ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకొని అన్ని గ్రామాలు, పట్టణాలు, మండలకేంద్రాల్లో జెండా పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు పార్టీ జెండాలను ఎగురవేశారు. అనంతరం వాహన శ్రేణులను జెండా ఊపి ప్రారంభించి ర్యాలీగా ఓరుగల్లుకు తరలివెళ్లారు. జడ్చర్ల జాతీయ రహదారి వద్ద మహబూబ్‌నగర్, నారాయణపేట తదితర జిల్లాల నుంచి వచ్చే వాహనాలకు మాజీ ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. వరంగల్‌లో జిల్లాలో అట్టహాసంగా జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఊరువాడ అంతా ఒక్కటిగా వందలాది వాహనాల్లో తరలివెళ్లి పాలమూరు ప్రజానీకం అంతా కేసీఆర్‌కు బాసటగా నిలుస్తామని ప్రకటించారు.

– మహబూబ్‌నగర్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రజతోత్సవ వేడుకలు అంబరాన్నంటాయి. 25ఏండ్ల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా గులాబీ జెండా ఆదివారం రెపరెపలాడింది. అక్కడి నుంచి గులాబీ బాస్ కేసీఆర్ వరంగల్‌లో నిర్వహించిన రజతోత్సవ సభకు వివిధ వాహనాల్లో వేలాదిగా తరలివెళ్లారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాలో పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన వాహనాలన్నీ కిక్కిరిసిపోయాయి. చోటు లేక ఎక్కడికక్కడే ఆగిపోయారు. కొంతమంది స్వచ్ఛందంగా అద్దెకు వాహనాలను తీసుకొని వెళ్లారు. వనపర్తి జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో గులాబీ జెండా ఎగురవేశారు. అలంపూర్‌లో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, నారాయణపేటలో రాజేందర్‌రెడ్డి, జడ్చర్లలో లక్ష్మారెడ్డి, అచ్చంపేటలో గువ్వల బాలరాజు, నాగర్‌కర్నూల్‌లో మర్రి జనార్దన్‌రెడ్డి, మక్తల్‌లో చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, దేవరకద్రలో ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, కల్వకుర్తిలో జైపాల్ యాదవ్, కొడంగల్‌లో పట్నం నరేందర్‌రెడ్డి, కొల్లాపూర్‌లో బీరం హర్షవర్ధన్‌రెడ్డి, గద్వాలలో పార్టీ ఇన్‌చార్జి బాసు హనుమంతునాయుడు పార్టీ జెండాలను ఎగురవేశారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు రజతోత్సవ సభకు వెళ్లేందుకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేయగా, వాటిని వారు జెండా ఊపి ప్రారంభించారు.

***పల్లె, పట్టణాల్లో జెండా పండుగ..***

భారత రాష్ట్ర సమితి 25ఏండ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకొని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. కొన్ని చోట్ల మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు జెండా ఎగరవేయగా, మిగతా చోట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎగురవేశారు. అన్ని గ్రామాల్లో, మండల కేంద్రాల్లో జెండా పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా చుట్టూ గులాబీ రంగులు వేసి శోభాయమానంగా తీర్చిదిద్దారు. అనంతరం కేసీఆర్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు.

***వాహనాలు సరిపోక..***

రజతోత్సవ సభకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రతి నియోజకవర్గం నుంచి 5వేల మంది వరకు కార్యకర్తలను తరలించారు. వరంగల్ దూరం కావడంతో కొన్ని ప్రాంతాల్లో శనివారం అర్ధరాత్రి నుంచే కార్యకర్తలను తరలించారు. చాలా గ్రామాల్లో వచ్చిన వాహనాలన్నీ అప్పటికప్పుడే నిండిపోవడంతో అధినాయకత్వం సూచించిన మేరకే జన సమీకరణ చేస్తున్నామని చెప్పారు. అయినా కార్యకర్తలు వినకపోవడంతో కొంతమంది చాలా మంది కార్యకర్తలు సొంత డబ్బులు పెట్టుకొని అద్దె వాహనాల్లో తరలివెళ్లారు.



నారాయణపేటలో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరించిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి



బాలానగర్ నుంచి బస్సులో తరలివెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



ఊర్కొండ వద్ద జాతీయ రహదారిపై జెండా ఎగురవేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

***జన సమీకరణపై ఇంటెలిజెన్స్ ఆరా..***

రజతోత్సవ సభకు ఎంత మంది జనం వెళ్తున్నారు, ఎన్ని వాహనాలు వెళ్తున్నాయని మండలాల వారీగా ఇంటెలిజెన్స్, పోలీస్ యంత్రాంగం ఆరా తీయడం కనిపించింది. ప్రతి మండల కేంద్రం నుంచి ఎన్ని వాహనాలు, ఎంతమంది వెళ్లారనేది లెక్క తీసి జిల్లా ఎస్పీకి పంపించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఇంటెలిజెన్స్, మఫ్టీ పోలీసులు బీఆర్ఎస్ కార్యకర్తలపై నిఘా పెట్టి మరి వివరాలు సేకరించారు. సోషల్ మీడియాలో వచ్చిన పోస్టులు, ఫొటోలను కూడా నిశితంగా పరిశీలించి వాటిని అధికారులకు పంపించినట్లు సమాచారం. అయితే అంచనాలకు మించి బీఆర్ఎస్ కార్యకర్తలు వరంగల్ సభకు వెళ్లడం, సీఎం సొంత జిల్లా నుంచి ఊహించని విధంగా పెద్దఎత్తున బీఆర్ఎస్ కార్యకర్తలు తరలివెళ్లడం షాక్‌కు గురిచేసింది. మొత్తంపై బీఆర్ఎస్ రజతోత్సవ సభ అంచనాలకు మించి సాగడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపించింది.

***క్యాడర్‌లో ఫుల్ జోష్..***

రజతోత్సవ సభ విజయవంతం కావడంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో గులాబీ కేడర్‌లో జోష్ పెరిగింది. ఉదయం నుంచి కార్యకర్తలు, నాయకులు బీఆర్ఎస్ సోషల్ మీడియాతో పాటు ఇతర గ్రూపుల్లో చలో వరంగల్ సభకు వెళ్లే ఫొటోలను షేర్ చేశారు. వరంగల్ సభకు చేరుకొని కేసీఆర్ స్పీచ్ విని కేరింతలు కొట్టారు. కేసీఆర్ స్పీచ్ ఫుల్ జోష్ నింపింది. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని కార్యకర్తలు ఘంటాపథంగా చెబుతున్నారు.



జోగుళాంబ గద్వాల నుంచి వాహనాల్లో భారీగా తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు



మక్తల్‌లో బీఆర్ఎస్ జెండాను ఎగురవేసిన మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

## వాహనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

అలంపూర్, ఏప్రిల్ 25 : ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు నాయకత్వంలో అలంపూర్ పట్టణంలోని బ్రాహ్మణవీధిలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు వెంకట్రామయ్య శెట్టి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వరంగల్ ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలకు తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరెడ్డి, నరేందర్‌రెడ్డి, మురళి, భూషణం, శ్రీనివాసులు, రాంబాబు, రఘు, వీరసేన పాల్గొన్నారు.



రజతోత్సవ సభకు తరలివెళ్తున్న వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు



వంగూరులో బీఆర్ఎస్ జెండాను ఎగురవేసిన నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు



కల్వకుర్తి : డప్పుకొడుతూ రజతోత్సవ సభకు తరలివెళ్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



భూత్పూర్‌లో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



జోగుళాంబ గద్వాల నుంచి రజతోత్సవ సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నేత బాసు హనుమంతు నాయుడు, కార్యకర్తలు



సభకు వెళ్తున్న వారితో కరచాలనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

## పిడుగుపాటుకు ఇద్దరు మృతి

మక్తల్, ఏప్రిల్ 27 : పిడుగుపాటుకు ఇద్దరు వ్యక్తులు, ఒక ఎద్దు మృతిచెందిన ఘటన మక్తల్ మండలంలో ఆదివారం చోటుచేసుకున్నది. మక్తల్ మండలం సూపర్‌పల్లిలో పిడుగుపాటుకు గురై భవన నిర్మాణ కార్మికుడు అంజప్ప(30) మృతిచెందాడు. దాదనపల్లిలో కురువ కురుమూర్తి(16) పిడుగుపాటుకు గురై మృతిచెందాడు. మక్తల్ మున్సిపాలిటీలో 8వ వార్డు కొత్త గార్లపల్లిలో కర్రె లక్ష్మప్ప అనే రైతుకు చెందిన కాడెద్దు వ్యవసాయ పొలంలో మేత మేస్తుండగా పిడుగుపడటంతో మృతిచెందింది. అకస్మాత్తుగా కురిసిన వర్షానికి ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. కృష్ణ మండలం కాందోటికి చెందిన రైతు తాయప్ప పొలంలో పిడుగుపడడంతో ఆవు మృతిచెందింది. మక్తల్, మాగనూరు, కృష్ణ మండలాల్లో ధాన్యం తడిసిపోయింది.



పిడుగుపాటుకు మృతిచెందిన కురుమూర్తి

